# రామయ తండ్రీ...

నిశ్శబ్దంగా పారుతోన్న సెలయేరు...

తొలి సంధ్య వెలుగులకి బంగారు పూత పులుముకున్నట్టు పసిడివర్ణమై సాగుతోంది ఏరు...ఇసుక లింగాన్ని చేతుల్తో ప్రతిష్ఠించి... పూజకి తెచ్చిన పుష్పాల్ని అలంకరించి నిగ్రహంగా కూచున్నాడు శ్రీరామచంద్రుడు.

చేతులు జోడించి... కళ్ళు మూసుకొని ధ్యానముద్రలోకి వెళ్తుంటే... మనసు కుదిపేసినట్టు... ఒక శకలమై రాలిపడ్డ జ్ఞాపకం... ఒక ఉలికిపాటు... కళ్ళల్లో కలవరపాటు... రెప్పకింద ఎగిసిపడ్డ ఉప్పెన...

జరజరా జారిపోయిన ఓ కన్నీటిబొట్టు...

నిగ్రహం చెదిరిన మనస్సుని అదుపులో ఉంచుకోవడానికి 'ఓ...మ్...' అంటూ పలుకబోయాడు... కానీ... చిత్రంగా... జానకీ... అని పలికాయి వణుకుతున్న పెదవులు... దేహం అదురుతోంది...

ధ్యానం చెదురుతోంది... గుండె లయ తప్పుతోంది...

సీతని అడవులకి పంపిన తరువాత ఏకాంతంగా ఏటిఒొడ్డున ధ్యానం చేసుకోవడానికి వచ్చిన శ్రీరామచంద్రుడికి... స్మృతిపథంలో సీతనే కన్పడుతూ... ధ్యానం చెదిరిపోతోంది...

రాజప్రాసాదంలో మైథిలి జ్ఞాపకాలు చుట్టుముడుతుంటే... పూజకి భంగం కలగకుండా ఒంటరిగా నదీతీరానికి విచ్చేసిన శ్రీరామచంద్రుడు ఎంత నిగ్రహించుకున్నా... ఇక్కడైనా ధ్యానజగత్తులోకి వెళ్ళలేకపోతున్నాడు.

మూసుకున్న కళ్ళలో ఎదురుగా ఉన్న శివలింగానికి బదులు.. ముగ్ధ మోహినిలా ముడుచుకొని దీనంగా చూస్తున్న సీతమ్మ తల్లే ప్రత్యక్షమవుతోంది. దుఃఖంతో తనకు తెలియకుండానే కళ్ళు ఎర్రబడ్డాయి... కన్నీటి తెరలు రెపరెపలాడుతూ... బొట్లుబొట్లుగా జారి ఇసుకలింగంపైబడి ఇంకిపోతున్నాయి... రోజూ పుష్పాలతో అభిషేకించబడే శివలింగం... కన్నీటితో అభిషేకించబడి తడిసి ముద్దవుతోంది.

మనోఫలకం మీద మైథిలి జ్ఞాపకాల్ని తుడిచేస్తూ... ధ్యానం పైనే ప్రాణాన్ని నిలిపే ప్రయత్నం చేస్తూ... మరోసారి నిష్ఠగా కళ్ళు మూసుకున్నాడు...

విరహచంచలమైన మనసుని భక్తి పారవశ్యంతో బందీ చేయడానికి ప్రయత్నిస్తూ... ఓంకార నాదాన్ని గంభీర స్వరంతో పఠించబోయాడు.

కానీ... పెదవుల్లోంచి ఏ పలుకూ రాలేదు...

గుండె చప్పుళ్లు... జాహ్నవి నామాన్ని స్మరిస్తున్న శబ్దాలై లయ తప్పుతున్నాయి... గుండెల్నిండా ఊపిరి తీసి... శరీరాన్ని మనసునీ ఏకం చేసి 'ఓ...మ్...' అన్నాడు గొంతు నరాల్ని సవరిస్తూ... బలవంతంగా స్మరిస్తూ...

కొద్ది నిమిషాల తరువాత... తేరుకున్న మనసు... తేటతెల్లమై ధ్యానముద్రలోకి వెళ్లింది.

మనసు... శివార్చనలో మునిగిపోయింది.

ఓ...మ్...

ఓ...మ్...

ఓ...మ్...

నిశ్చలమైన మనస్సుని చెదరగొడుతూ... కర్ణభేరిని తాకిన సన్నటి ఏడ్పు...

తెరలు తెరలుగా వచ్చి... తపోభంగం కలిగిస్తోన్న ఏడ్పు...

రాముడి ధ్యానం చెదిరి... కళ్ళు తెరిచాడు...

దూరంగా.. దీనంగా... జీరబోయిన గొంతుతో ఏడ్పు విన్పిస్తూనే ఉంది.

చుట్టూ చూశాడు...

కొంత దూరంలో ఇసుకలో కూచుని, మోకాళ్ళ మధ్య తల ఆనించి దుఃఖిస్తున్న ఓ వ్యక్తి కన్పించాడు. వెక్కివెక్కి ఏడుస్తున్నట్టు ఎగురుతున్న అతడి భుజాలు తెలుపుతున్నాయి... అతడు సముద్రమంత శోకంతో కదిలిపోతున్నాడని !!

శ్రీరాముడి మనసు బాధగా మూలిగింది.

'తన రాజ్యపాలనలో... ఏ కష్టం అతణ్ణి కదిలించిందో.. ఏ నష్టం అతడి సుఖాన్ని కబలించిందో... అనుకున్నాడు.

శివలింగానికి నమస్కరించి లేచాడు. అడుగులో అడుగులేసుకుంటూ అతణ్ణి చేరాడు. గొంతుకడ్డం పడుతోన్న వెక్కిళ్ల మధ్య అతడు శోకసంద్రమే అయ్యాడు.

పిలవడానికి కొన్ని క్షణాలు తటపటాయించిన శ్రీరాముడు... అతడి భుజంపై చేయి వేసి 'నాయనా...' అన్నాడు లాలనగా...

అతడు వినే స్థితిలో లేడు...

మూడు, నాలుగు పిలుపులకు గాని ఈ లోకంలోకి రాలేదు. ఆ తరువాత నిదానంగా తలెత్తిచూశాడు... మాసిన బట్టలతో అనాగరికంగా ఉన్నాడు.

కన్నీళ్ళ మధ్య అస్పష్టంగా కన్పించిన రాముణ్ణి పోల్చుకోలేదు...

ఓదార్పుతో పిలుస్తోన్న రామ పలుకుల్ని విన్న అతడు కొద్ది సేపట్లో తేరుకున్న వెంటనే... అతడి కళ్ళకి నీలమేఘశ్యాముడు స్పష్టంగా కన్పించాడు. కలయో... మాయో తెలీని స్థితిలో అతడు ఆశ్చర్యంగా, నమ్మలేకుండా చూశాడు. దుఃఖమో సంతోషమో తెలీని స్థితిలో 'ప్రభూ...' అంటూ ఏడుస్తూ కాళ్లమీద పడ్డాడు.

అనునయంగా లేవదీసిన శ్రీరాముణ్ణి చూసి... అతడు తడబడుతూ... ఏదో గుర్తొచ్చినవాడిలా బాధగా, కోపంగా... చప్పున దూరంగా జరిగాడు.

శ్రీరాముడు ఆశ్చర్యపోయాడు...

"ఎవరు నీవు?" అన్నాడు.

అతడు మౌనంగా తలొంచుకున్నాడు... తరువాత తలెత్తి రామచంద్రుణ్ని తీక్షణంగా చూశాడు.

'ప్రభూ... మీరంటే... మీరంటే నాకు కోపం...' అన్నాడు.

చందమామని తెచ్చివ్వని తల్లిమీద అలిగిన ఆరేళ్ళ పిల్లాడు దూరంగా జరిగి అన్నట్టుగా ఉందామాట.

"నామీద కోపమా... నా పాలనలో నీకేమైనా అపకారం జరిగిందా... నీ కుటుంబానికేమైనా అపచారం జరిగిందా... నీకు కలిగిన కష్టమేమి?" అనడిగాడు.

"మీవల్లకాదు... నావల్లే... నావల్లే ఆ మహాతల్లికి అపకారం జరిగింది. నా మాటవల్లే నా తల్లి అడవుల పాలైంది..." అన్నాడు మళ్లీ దుఃఖిస్తూ...

రామచంద్రుడికి అయోమయంగా ఉంది...

"ఎవరు నీ తల్లి...? " అడిగాడు అనునయంగా.

"నా తల్లెవరో తెలియని నువ్వేం ప్రభువ్వయ్యా..." అన్నాడు వాడు రోషంగా.

వాడి అమాయకత్వానికి చిరునవ్వులు వెలిశాయి రాముడి పెదాలపై.

"నామీద, నీకెందుకంత కోపమయ్యా? నీ తల్లికి నేను చేసిన అపకారమేమిటి?" అన్నాడు. "అయ్యా... నేను అజ్ఞానిని... అవివేకిని... తాగుబోతుని... నా మాట నీళ్ళమూట. కాని... నా మాటకు మీరు విలువియ్యడం తగదయ్యా... విలువిచ్చి మా తల్లిని దూరం చేయడం న్యాయమా తండ్రీ..." అన్నాడు.

అతడి దుఃఖంలో తెలియని ఆవేశం... ఆవేదన కలగలిపి వస్తున్నాయి.

"నువ్వు..." అన్నాడు శ్రీరాముడు అనుమానంగా. "ప్రజలేమనుకుంటున్నారోనని తెలియజేసే మీ వేగుడు భద్రుడు మీకు చేరవేశాడే.. ఒక నిందని... తాగిన మైకంలో ఆ నిందని మోపిన చాకలి తిప్పణ్ణి ప్రభూ..." అన్నాడు మాటలు కూడదీసుకుంటూ...

"మరి నీలో నాపై అంత కోపమేమిటి తిప్పడూ..." అన్నాడు.

"కోపంకాక మరేంటయ్యా... నువ్వు చేసింది న్యాయమా? నేను అజ్ఞానిని... తెలిసో తెలియకో ఒక మాటన్నాను... ఆ మాటన్నందుకు ఒక రారాజుగా నన్ను జ్ఞానవంతుణ్ని చేయ్యాలిగాని... మహాసాధ్విని అడువుల పాల్జేయటం న్యాయమా? నేను అవివేకిని... ఆ మాటన్నందుకు నన్ను వివేకవంతుణ్ని చేయ్యాలిగాని... సీతమ్మ తల్లిని అడవులకు పంపటం సమ్మతమా తండ్రీ... అందుకే నీమీద కోపం..." అన్నాడు.

వాడి మాటలకు రాముడు నవ్వాడు.

అజ్ఞాని ఓ మాటన్నప్పుడు... వాణ్ని జ్ఞానవంతుణ్ని చేయ్యాలిగాని... వాడి మాటలకనుకూలంగా నడుచుకోవటమేమిటనే... తిప్పడి ఆత్మక్షోభ అర్థమైన రామచంద్రుడు నిండుగా నవ్వాడు.

ప్రభువని కూడా చూడకుండా వాడు సుత్తిమెత్తగా నిలదీస్తున్నందుకు అభినందన పూర్వకంగా నవ్వాడు.

"సీతమ్మ తల్లిని అడవుల పాల్జేసినందుకు నేనెంత దుఃఖిస్తున్నానో మీకేం తెల్సు? ఎటో వెళ్లివచ్చినందుకు... నమ్మడానికి నేనేం వెర్రి రాములోణ్ని కాదు అని నా భార్యని చితకబాదినా... తెల్లారి అది కన్పించకపోతే నా మనసు నిలువదయ్యా... రాత్రి పోట్లాడుకున్నా తెల్లారి కల్సిపోతం... ఆలుమగలంటే అట్టాగే ఉండాలని మీకు నేను చెప్పాలా ప్రభూ..." అన్నాడు వాడు.

భార్యాభర్తల అనుబంధాన్ని చెప్పిన ఆ ఒక్క క్షణం... శ్రీరాముడు మౌనంగా ఉండిపోయాడు. వాడినిని సముదాయించడానికి "నేను రాజుని తిప్పడూ... లోక కళ్యాణార్థం కొన్ని పనులు కఠినంగా ఉన్నా... అమలు చేయక తప్పదు.

నువ్వు వేసింది నిందే కావచ్చు. కానీ దాని ఫలితం ఎంత దారుణంగా ఉంటుందో కూడా ప్రజలకు తెలియజెయ్యాల్సిన బాధ్యత ప్రభువుగా నామీద ఉంది" అని చెప్పాడు శ్రీరాముడు.

"అయ్యా... దానికి పరోక్షంగా బాధ్యులైన నాకు మాత్రం మీరు ఏ శిక్షా వేయలేదు. మీరు శిక్ష వేసినా భరించేవాణ్ణి. నా దుఃఖం చల్లారాలన్నా... మీపై కోపం తగ్గాలన్నా...నాకు మీరు ఏ శిక్షవేసినా ఆనందంగా భరిస్తానయ్యా... లేదంటే సీతమ్మ తల్లి అడవుల్నించి వచ్చేంతవరకూ... ఈ వాగొడ్డునే ఇట్లాగే ఏడుస్తూ కూచుంటాను..."

వాడి కళ్ళలోంచి మళ్ళీ ధారాపాతంగా కన్నీళ్ళు...

ఒక మహాపరాధం చేసిన పశ్చాత్తాపం వాడి శరీరమంతా పరుచుకొని చిగురుటాకులా వణికిస్తోంది. నరం లేని నాలుక చిమ్మిన ప్రేలాపనతో జరిగిన పరిణామానికి... గుండె పగిలి వస్తోన్న దుఃఖం.

అది అర్థం చేసుకున్న రాముడు...

"సీత అయోనిజ... ఆమెకు ఏ కళంకమూ అంటదు. కానీ రాజధర్మం యొక్క కాఠిన్యత చూపించక తప్పలేదు" గంభీరంగా పలికాడు పూర్ణావతారి.

"ఆ తల్లికోసం ఉడుత కూడా బుడుతడు సాయం చేసిందంటారే... మీరు ప్రేమగా నిమిరితే నిలిచి పోయిన చారలు దాని మంచితనాన్ని గుర్తుకు తెస్తుంటే... నాతో మాత్రం ఎందుకలా పలికించావయ్యా... పలికించినా నన్ను శిక్షించకపోవటం రాజధర్మం ఎలా అవుతుంది ప్రభూ..." అనడిగాడు చేతులు జోడించి.

శ్రీరాముడి కళ్ళలో అనురాగం తొణికిసలాడింది.

"నీ మిత్రుడైన సుగ్రీవుడి కోసం వాలిని శిక్షించావే... మరి సీతమ్మ తల్లి మీద అభాండం వేసినందుకు నామీద నీకే కోపమూ లేదా తండ్రీ..."

"ఆ స్థితిలో పలికింది నువ్వు కాదు తిప్పడూ... నీలో పొంగిపొర్లుతున్న మద్యం... ఒక వ్యసనం కాని, ఒక కోరిక కాని తన జీవితం మీదే కాదు... ఇతరుల జీవితం మీద కూడా ప్రభావం చూపుతుంది. అందులోనూ... ప్రజలకున్న వ్యసనాలూ కోరికలూ ప్రభువు మీద కూడా ప్రభావం చూపుతాయి" అని చెప్పాడు నిర్మలంగా మాయమానుషావతారమైన శ్రీరాముడు.

"అది కాదయ్యా... అడవిలో ఆ తల్లి ఎలా తల్లడిల్లుతుందోనయ్యా... ఆ కనికరమైనా లేదా ప్రభూ" అన్నాడు ఆందోళన నిండిన గొంతుతో.

"అగ్ని కూడా దహించలేని సీతను... ఎండా వానా ఏం చేస్తాయయ్యా..." అంటూ ఓదార్చాడు.

ఆ ఓదార్పు... పట్టాభిషేకం విఫలమై... అరణ్య వాసానికి వెళ్ళేముందు శోకాక్రాంతుడైన లక్ష్మణున్ని ఓదారుస్తున్నట్టే అన్పించింది. పైకి నిబ్బరంగా అన్నాడే కాని.... గుండె లోతుల్లో సీత కోసం పలవరిస్తోన్న ప్రకంపనాల ఘోష...

అది పసిగట్టిన తిప్పడు మరింత చలించిపోయాడు.

"నన్ను చరిత్రహీనుణ్ణి చేయకు ప్రభూ... శిక్ష పొందిననాడే ముక్తి పొందినట్టు...

మీ రాజధర్మంలో నాది తప్పు కాకపోయినా... నా బతుకు మీద పడ్డ మచ్చ చెరిపేసుకోవడానికైనా... నన్ను శిక్షించవయ్యా" అన్నాడు.

మట్టి పరిమళాలంటుకున్న వాడి శరీరం కంపించి పోతోంది.

"నీకు నేనెలా శిక్షవేయగలను తిప్పడూ...?" సౌమ్యంగా అడిగాడు.

"నాకు నేనే శిక్ష విధించుకోవాలనుందయ్యా... నన్ను నేనే శపించుకోవాలనుంది... ఈ నదిలో బండగానైనా మారిపోవాలనుందయ్యా... బట్టలుతికేటప్పుడు ఆ బట్టతో బాదించుకోవాలనుంది... ఏనాటికైనా సీతమ్మ తల్లి ఈ నదిలోకొచ్చి తన బట్టల్ని ఈ చాకలి బండకి బాదినప్పుడు... శాప విమోచనం చేసుకోవాలనుంది. కాని... నాకు ఏ తాంత్రిక విద్యలూ రావయ్యా..." అన్నాడు.

వాడి భక్తికి రాముడి మనసు పాదరసమే అయింది.

ఎంత అనునయించినా వాడి దుఃఖం ఆపలేనిదని అర్థమైపోయింది. వీడికున్న ఆత్మవిమర్శలో ఇసుమంతైనా రావణుడికి ఉన్నా తన చేతిలో మరణించేవాడు కాదే అని నవ్వుకున్నాడు.

లక్ష్మణుడు వెంట ఉండి ఉంటే... ఒక సామాన్యుడి ఆత్మక్షోభని చూసేవాడు కదా అనుకున్నాడు. సీతకి ఈ విషయం తెలిస్తే... హనుమ మీదికన్నా రెట్టింపు ప్రేమ ఈ అల్పజీవి మీద కూడా కురిపించేదేమో అనుకున్నాడు.

రాముడు తిప్పడి దగ్గరగా వెళ్ళాడు...

ఇసుకలో కూచుంటూ "కూచో తిప్పడూ..." అన్నాడు ఆప్యాయంగా.

తిప్పడు సందిగ్ధంగా కూచున్నాడు.

"నీ పాపానికి ప్రాయశ్చిత్తం కావాలంటావ్... నీ నేరానికి శిక్ష విధించాలంటావ్. అంతే కదా" అన్నాడు.

తిప్పడు శ్రీరామచంద్రుడికి అంత దగ్గరగా కూచోవటంతో నోటిమాట రాక అవునన్నట్లు తలూపాడు.

బెరుకుగా కొంచెం దూరం జరిగాడు.

రాముడు నవ్వి "ఇంకా కోపం పోలేదా... అక్కడ కాదు... ఇక్కడ కూచో..." అని తన తొడని చూపించాడు.

తిప్పడికి ముచ్చెమటలు పోశాయి.

"రా... తిప్పడూ" అన్నాడు ప్రేమగా... బొమ్మలా వచ్చి వాడు రాముడి తొడపై కూచున్నాడు.

ఒక తల్లి స్పర్శ... ఒక తండ్రి స్పర్శ... ఒక దేవదేవుడి స్పర్శ...

రాముడి స్పర్శ తగలగానే... వాడి జవసత్వాలు తన్మయంగా గాలిలో తేలిపోయాయి. ఒంటిలోని నరాలు వీణతీగలై 'రామాలాపన' చేశాయి.

"నిన్ను అక్షరాస్యుణ్ని చెయ్యడమే... నీ నిందకి ప్రాయశ్చిత్తం" అని చెప్పిన రాముడు... వాడి కుడిచేతి చూపుడువేలిని పట్టుకొని... ఇసుకలో 'అ' అనే అక్షరాన్ని రాయించాడు.

శరీరమంతా విద్యుత్తు పాకినంత స్పందన... కాని... ఆ అక్షరం స్పష్టంగా... సౌష్టవంగా రాలేదు.

"ఆ అక్షరాన్ని తుడిచెయ్యి తిప్పడూ..." అన్నాడు.

వాడు ఆ ఇసుకలో గీతల్ని తుడిచేశాడు... వాడి శరీరమంతా ఏదో వెలుగుల చైతన్యం...

"నువ్వు తుడిచేసింది 'అ' అనే అక్షరాన్ని కాదు... నీలో ఉన్న అజ్ఞానాన్ని.. " అంటూ మరోసారి రాయగలవా ' అని ప్రశ్నించాడు.

కాని... వాడి వేళ్లు అప్రయత్నంగా 'రామా' అని రాశాయి.

తిప్పడి మనసు... శరీరం మాయాకుబుసం విడిచినంత తేజోవంతంగా అయిపోయాయి.

రామనామం రాసి... జన్మబంధం తొలగి ముక్తుడైనట్టు...

రామబాణం జపించి... అపచారం నించి విముక్తుడైనట్టు... మనసు మబ్బుతునకలా మారిపోయింది.

తిప్పడు ఆశ్చర్యంతో తాను రాసిన పదాన్ని చదివాడు. అక్షర తపస్సుకు జాతి నియమం లేదని తెలియజెప్పిన ఆ దేవ దేవుడికి ప్రణమిల్లుతూ... ప్రభూ... అంటూ పక్కకి జరిగి... చేతులెత్తి నమస్కరించాడు.

కాని... అక్కడ...

రాముడు లేడు!!

కన్నీళ్ళతో గుంతలుపడిన ఆ ఇసుకలో... చూపుడు వేలితో రాసిన అక్షరాలు మాత్రమే అగుపించాయి.

అవి... 'సీతా' అన్న రెండక్షరాలు !

ఆ వెనుకే... రాముడు కదిలిపోయిన పాదముద్రలు !!!